ప్రజాశక్తి

సోమవారం 14 జులై 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

వేడెక్కిన రాజకీయం

- కృష్ణాలో అధికార, ప్రతిపక్ష పార్టీల దాడులు, ప్రతి దాడులు
- దుమారం రేపుతున్న పేర్ని వ్యాఖ్యలు
- గుడివాడలో ఉద్రిక్త వాతావరణం

పామర్రులో మాట్లాడుతున్న పేర్ని నాని, గుడివాడలో ఉద్రిక్త వాతావరణం (ఫైల్)

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): గత మూడు రోజులుగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య జరుగుతున్న దాడులు, ప్రతిదాడులతో పాటు మాటల యుద్ధంతో కృష్ణాజిల్లాలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బందరు నుండి మొదలైన ఈ మాటల యుద్ధం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా విస్తరించింది. మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు పేర్ని వెంకట్రామయ్య (నాని) రెండు రోజుల క్రితం పామర్రు వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధంతో పాటు ప్రత్యక్ష దాడులకు కారణమవుతున్నాయి. నాని మాట్లాడుతుండగా కార్యకర్తలందరూ ఒక్కసారిగా రఫ్ఫా రఫ్ఫా అంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన పేర్ని నాని (మిగతా 2లో)

ప్రతి వారం సృజనాత్మక కార్యక్రమాలు

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ
- ఉత్సాహంగా ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

హరిత బెరం పార్కు కృష్ణా తీరంలో ఆదివారం జరిగిన ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల్లో 300 మందికి పైగా యువత, చిన్నారులు పాల్గొని తమ కళా ప్రతిభను ప్రదర్శించారు. స్వర్ణాంధ్ర విజన్ @ 2047, పి4 విధానం, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, స్వచ్ఛంధ్ర, (మిగతా 2లో)





ఎనర్జీ అసిసెంట్లకు ప్రమోషన్లివ్వాలి

విజయవాడ: యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు) విజయవాడ సర్కిల్ రీజనల్ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ కృష్ణలంకలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జెఎల్ఎం గ్రేడ్ -2(ఎనర్జీ అసిస్టెంట్లు) ఉమ్మడి కృష్ణా జిల్లా సదస్సు యూనియన్ అధ్యక్షులు ఎల్.రాజు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జెఎల్ఎం గ్రేడ్-2 రాష్ట్ర కన్వీనర్ పి.పెంచల ప్రసాద్ మాట్లాడుతూ జెఎల్ఎం గ్రేడ్-2లు నియమితులైన నాటి నుండి వారి సమస్యలు పరిష్కారం కోసం దశలవారీగా యూనియన్ చేసిన ఆందోళన, పోరాటాలు కృషి ఫలితంగా కొన్ని హక్కులు సాధించుకున్నామన్నారు. అయితే ప్రధాన సమస్యలైన సర్వీస్ రెగ్యులేషన్స్, ఎఎల్ఎం ప్రమోషన్స్ సాధించాలన్నారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులతో వేసిన కమిటీకి సమస్యలపై సానుకూలంగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన అర్జీలను అధికారులకు అందజేస్తామన్నారు యూనియన్ రీజనల్ కార్యదర్శి కనక లింగేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నతస్థాయి అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు సర్కిల్, డివిజన్లో అమలు చేయటం లేదన్నారు. ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు ఇచ్చి చాలాకాలం గుడుస్తున్నా నేటికీ అమలు జరగలేదన్నారు. జెఎల్ఎం గ్రేడ్-2 సమస్యలపై ఈ నెల 19న సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాలని సదస్సు తీర్మానించిందన్నారు. యూనియన్ డిస్కం అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యూనియన్ స్థాపించిన నాటి నుండి సంస్థలో వేలాది మందిని విలేజ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయించిన చరిత్ర ఉందని, జెఎల్ఎం గ్రేడ్-2 అందరూ విశాల ఐక్యతతో యూనియన్ చేసే పోరాటాల్లో పాల్గొవాలని

పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్.సి.హెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల ఫలితంగా కీలకమైన విద్యుత్ సంస్థలో పని చేస్తున్న జెఎల్ఎం గ్రేడ్-2లు చాలా హక్కులు నష్టపోతున్నారన్నారు. అందరూ సమిష్టిగా ఈ విధానాలను వ్యతిరేకించి రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే అన్ని సౌకర్యాలు అమలుకు యూనియన్ పిలుపుల్లో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రాజేష్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజనల్ కార్యదర్శి పి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

వేడెక్కిన రాజకీయం

'లోకేష్ గాడు ఎర్ర బుక్ అంటాడు, మీరు రఫ్ఫా రఫ్ఫా అంటారు... ఎన్నిసార్లు అంటారురా... చీకట్లో కన్ను కొట్టాలి తెల్లారేపాటికి అయిపోవాలా... తెల్లారి ఏమీ తెలియనట్లు వెళ్లి ఏమి జరిగింది ఎలా జరిగిందని పరామర్శించాలి' అంటూ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ఒక్క సారిగా ఇరు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు మాటల యుద్ధం మొదలుపెట్టారు. గుడివాడ లింగవరంలోని కె.కన్వెన్షన్లో వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం జరిగింది. అదే సమయంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిడిపి శ్రేణులు భారీ ర్యాలీగా నాగవరప్పాడు సెంటర్‌కు చేరుకున్నాయి. అలాగే వైసిపి సమావేశానికి ఆహ్వానం పలుకుతూ నాగవరప్పాడు సెంటర్‌లో ఆ పార్టీ నేతలు ప్రత్యేక బ్యానర్లు ఏర్పాటు చేశారు. టిడిపి నేతలు మాజీ మంత్రి కొడాలి నానిని అవమానిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేయడంతో పాటు నినాదాలు చేస్తూ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. ఇదే సమయంలో కొందరు టిడిపి నాయకులు వైసిపి బ్యానర్లను చించి వేశారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇదే తరుణంలో కె.కన్వెన్షన్లోకి వెళ్లేందుకు టిడిపి నేతలు ప్రయత్నించిన విషయం తెలుసుకున్న వైసిపి నేతలు కూడా కె. కన్వెన్షన్ నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడే ఉన్న గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ నేతృత్వంలోని పోలీసులు వారు బయటకు రాకుండా నిలువరించారు. ఇదే సమయంలో సమావేశానికి హాజరవ్వడానికి కృష్ణాజిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పల హారిక నాగవరప్పాడు సెంటర్ మీదుగా లింగవరం వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే నాగవరప్పాడు సెంటర్‌కు భారీగా చేరుకున్న టిడిపి శ్రేణులు ఆమె కారును అడ్డగించారు. ఆమె వెనక్కి వెళ్లి మళ్లీ తిరిగి రావడంతో రెచ్చిపోయి కారుపై రాళ్లతో దాడి చేశారు. అయితే అదే కారులో ఉన్న ఆమె భర్త వైసిపి పెడన నియోజకవర్గ ఇంచార్జీ ఉప్పాల రాము రాళ్ల దాడిని నియంత్రించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని వాగ్వాదానికి దిగారు. దీంతో చైర్ పర్సన్ ఉప్పాల హారిక కన్నీరు పెట్టుకున్న సంఘటనలు చోటు చేసుకున్నాయి. అనంతరం తమపై దాడి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏదేమైనా అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ఇలా ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంపై జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌పై దాడి జరిగిన అనంతరం పేర్ని నాని ఫోన్‌లో మాట్లాడుతూ లోకేష్ డైరెక్షన్‌లో స్థానిక గుడివాడ శాసన సభ్యులు ఆదేశాలు మేరకు దాడి జరిగినట్లు, అలాగే ఒక బీసీ మహిళ మీద కావాలని దాడి చేశారని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలో చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని ఫోన్‌లో సంభాషించడం తీవ్ర దుమారం రేపుతున్నాయి. పేర్ని వెంకట్రామయ్య ఎవరితో ఫోన్లో సంభాషించారనే ప్రశ్న చర్చనీయాంశంగా మారింది. పామర్రు సమావేశంలో పేర్ని నాని విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసి రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని మచిలీపట్నం టిడిపి నేతలు ఫిర్యాదు చేయడంతో దీనిపై స్పందించిన మచిలీపట్నం ఆర్‌పేట పోలీసులు పేర్ని నానిపై 353(2), 196(1) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అలాగే అవనిగడ్డ పోలీసు స్టేషన్‌లోనూ కేసు నమోదు చేశారు.

హారికపై దాడికి హోంమంత్రిదే బాధ్యత

మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారికపై జరిగిన దాడి ఘటనకు హోం మంత్రి వంగలపూడి అనిత సమాధానం చెప్పాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. గుంటూరు క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌ల ప్రోత్సాహంతోనే టిడిపి సైకోలు ఈ దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. టిడిపి నాయకులపై విమర్శలు చేస్తే రాద్ధాంతం చేసే చంద్రబాబు, మంత్రులు వైసిపి మహిళా నాయకులపై దాడి జరిగితే ఎందుకు స్పందించరన్నారు. ఎవరైనా మహిళా నాయకులు ఒక్కటే కదా...మీకు ఒక రూలు, మాకో రూల్ అనుంటున్నారని ఎద్దేవా చేశారు. టిడిపి నాయకులపై విమర్శలు చేస్తే కేసులు నమోదు చేసే పోలీసులు తమ పార్టీ నాయకులపై దాడి చేసినా కేసులు పెట్టరన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన వైనంపై ప్రతిపక్షంగా తాము 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' పేరుతో ఒక కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. చంద్రబాబు మోసాలను ప్రశ్నించాలని ప్రజలను చైతన్యవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లోనూ మొదటి దశలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. గతంలో టిడిపి ప్రతిపక్షంలో ఉండగా వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు,నిరసనలు చేయలేదా అని ప్రశ్నించారు. బీసీ నాయకురాలు, కృష్ణాజిల్లా ప్రథమ పౌరురాలు ఉప్పాల హారిక గుడివాడకు చేరుకుంటే, ఆమె కారుపై తెలుగుదేశం, జనసేన గుండాలు రెచ్చిపోయి దాడులు చేశారు. కారు అద్దాలు పగులకొట్టారు, ఆమెపై దాడికి ప్రయత్నించారు. దీనిపై పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారన్నారు. అసాంఘిక శక్తులను అదుపు చేసే సామర్థ్యం పోలీసులకు లేదా? దాడి చేస్తున్న గుండాలను అరెస్ట్ చేయరా? మద్యం, గంజాయి మత్తులో దాడులు చేస్తే, మౌనంగా పోలీసులు నిలబడిపోయారు. ఒక బీసీ మహిళపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరుగుతుంటే, రక్షణ కల్పించలేని అసమర్థతతో వ్యవస్థను నడుపుతున్నారా అని ప్రశ్నించారు.

నేడు అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 14వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే విజయవాడ నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలను విఎంసి ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు అందజేయవచ్చని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.

అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : అమరావతిలో కొత్తగా తమ ఎఐ ప్లస్ క్యాంపస్‌ను ప్రారంభించనున్నట్లు బిట్స్ పిలానీ ఛాన్సలర్ కుమార్ మంగళం బిర్లా ఒక ప్రకటనలో తెలిపారు. బిట్స్ పిలానీ 2025 స్నాతకోత్సవ వేడుకల సందర్భంగా ఉన్నత విద్య భవిష్యత్తు కోసం ఒక లక్ష్యాన్ని వెల్లడించిందన్నారు. ఈ వేడుకల్లో ఛాన్సలర్ కుమార్ మంగళం బిర్లా మూడు ప్రధాన కార్యక్రమాలను ప్రకటించారు. అమరావతిలో అత్యాధునిక ఏఐ ప్లస్ క్యాంపస్ ప్రారంభించడం, ప్రాజెక్ట్ విస్తార్ కింద తమ క్యాంపస్లను విస్తరించడానికి, ఆధునీకరించడానికి రూ.1,219 కోట్ల పెట్టుబడి పెట్టడం, దాని ఎడ్ టెక్ ప్లాట్ఫామ్ బిట్స్ పిలానీ డిజిటల్‌ను అధికారికంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

నేడు షెడ్యూల్ కులాల స్థితిగతులపై సమీక్ష

ప్రజాశక్తి-విజయవాడ: జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ ఎన్‌టిఆర్ జిల్లాలో సోమవారం పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు నగరంలోని కలెక్టరేట్‌లోని ఏవీఎస్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలో షెడ్యూల్ కులాల జనాభా స్థితిగతులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల లబ్ధి, వారు నివసిస్తున్న ప్రాంతాలలో మౌలిక వసతుల పరిస్థితి, ప్రభుత్వపరంగా వారికి కల్పించిన సౌకర్యాలు, తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. సమావేశంలో ఎస్సీ కమిషన్ సభ్యునితో పాటు నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ డైరెక్టర్ డా.జి.సునీల్ కుమార్‌బాబు పాల్గొంటారు.

ప్రతి వారం సృజనాత్మక కార్యక్రమాలు

సేవ్ వాటర్, రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్, హరితాంధ్ర అంశాల్లో వేసిన వర్ణ చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి వారం హరిత బెరం పార్కులో సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఫొటోగ్రఫీ, యోగా, స్విమ్మింగ్ వంటి వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తామని.. వీటిలో నగర ప్రజలు, పర్యాటకులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. భవానీ ఐలాండ్‌లో బర్డ్స్ ఫొటోగ్రఫీ పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని పవిత్ర సంగమం, కొండపల్లి ఖిల్లా, గాంధీహిల్స్ తదితర పర్యాటక ప్రాంతాల్లోనూ వివిధ రకాల థీమ్స్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సెలవు రోజులను చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా వారిలో మంచి ఆలోచనలు వచ్చేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. జయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం మాట్లాడుతూ చిన్నారులు, యువత పర్యావరణం, జల వనరులు, కాలుష్య దుష్పరిణామాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి వారం వివిధ రకాల ఇతివృత్తాలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడకు సూపర్ స్వచ్ఛతా లీగ్ పురస్కారం లభించడానికి ప్రతిఒక్కరి కృషి కారణమని తెలిపారు.

పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం

పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఫ్లోర్ పెయింటింగ్ విభాగంలో స్వర్ణాంధ్ర విజన్ బి సేవ్ వాటర్ పెయింటింగ్‌తో జి.తనూజ మొదటి స్థానంలో నిలిచి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 7,500 పి.యామినీ విశాల, తృతీయ బహుమతి రూ.5 వేలు వి.జశ్వంతి, నాలుగో బహుమతి రూ.3 వేలు ఎం.సురేష్ పొందారు. ఫ్లోర్ పెయింటింగ్‌లో ఎల్.శ్వేత, పి.రచన, వి.అనురాధ, కె.హవీలా జెన్నీ, బి.రోహిత ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. డ్రాయింగ్ పోటీల్లో ఎంఎస్ వైష్ణవ్య తొలి బహుమతి అందుకోగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో రాహిల్ జయాన్, జి.భాష్యశ్రీ , లక్ష్ జైన్ నిలిచారు. టి.క్రిష్, జి.ఇషికా కష్ణన్, జి.ఆధ్వి, సాక్షం సుతార్, రామిరెడ్డి జశ్వితలు ప్రోత్సాహక బహుతులు అందుకున్నారు. పోటీలకు కళానిపుణులు పి.చిదంబరేశ్వరరావు, కళాసాగర్, పి.రమేష్, సంతోష్ కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, ఆయుష్ అధికారి డా.రత్నప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింటున్ను, విజయవాడ కృష్ణలంక, విక్రమ్ దుర్గయ్య స్ట్రీట్, డోరు నెం. 41-7-13, కాపురస్థురాలు దాసరి జగదీష్ కుమార్ గారి భార్య శ్రీమతి దాసరి లక్ష్మి ప్రసన్న @ జొన్నకూటి లక్ష్మి ప్రసన్న గారి ఉత్తర్వులు పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా : వడిగిన (లేటు) సంపూర్ణచంద్రరావు గారి భార్య శ్రీమతి వడిగిన ధనలక్ష్మి, నివాసం డోరు నెం. 20/259, పరస్ పేట, చిలకలపూడి, మచిలీపట్నం, కృష్ణాజిల్లా గారికి చెందిన దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని క్రయం పొందుటకు మా క్లయింటు, వడిగిన (లేటు) సంపూర్ణచంద్రరావు గారి భార్య శ్రీమతి వడిగిన ధనలక్ష్మి గారితో క్రయ ఖరారు పడి విక్రయ అగ్రిమెంటును **తేది 15.04.2025వ** తేదీన పొందియున్నారు. కావున మా క్లయింటు షెడ్యూల్ దాఖలు స్థిరాస్తిని క్రయం పొందుటలో ఎవరికైనను ఎట్టి చెల్ల దగిన క్లెయిములు గాని, చట్టపరమైన అభ్యంతరములు గాని కోర్ట్ జప్తులు గాని, తనకా బాకీలు గాని, సెక్యూరిటీలు గాని, భాగ లబ్ధ తగాదాలు గాని, ఈజుమెంటు హక్కులు గాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి **10** రోజులలోగా తగిన ఆధారములతో అభ్యంతరములను వ్రాత పూర్వకముగా రిజిస్టర్ పోస్టు, తిరుగు రసీదుతో తెలియజేయవలసిందిగా కోరటమైనది. లేని యెడల షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి నిర్వివాదమైన స్థిరాస్థిగా క్రయ దస్తావేజును రిజిస్టర్ పొందగలరు. గడువు తేదీ పిమ్మట వచ్చు అభ్యంతరములు మా క్లయింటును బైండు చేయజాలవు.

క్రయాస్థికి షెడ్యూలు

1వ ప్రతి

కృష్ణాజిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ వారి పరిధిలో చేరిన పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ, పటమట తాలూకు రీ.సర్వే నెం.31/5రు, అసెస్మెంటు నెం. 26222-యఫ్ రు దాఖాలా చ.గ.435.5 1/2 లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు:** బజారు అ.41-58లు **దక్షిణం:** జాస్తి సుబ్బారావు వగైరాల ఆస్థి అ.91-68లు **పడమర:** అవధూత ఆశ్రమం అ.41-58లు **ఉత్తరం:** ముసునూరి శారదాంబ గారి తాలూకు ఇల్లు స్థలము అ.97-68లు ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ. 435.5 1/2లు లేక చ.మీ. 364.17ర్లు లో అనిర్దిష్టపు జాయింటు హక్కు గల చ.గ.42లు లేక చ.మీ. 35.11ర్లు స్థలమున్నూ 2వ ప్రతి: సదురు పై తెలిపిన నెంబర్లు దాఖలా మొత్తము స్థలములో నిర్మించబడిన **"SRI NIDHI'S DHANA LAKSHMI TOWERS"** అను అపార్టుమెంటు నందిలి ఫోర్తు ఫ్లోరు, ఫ్లాట్ నెం. 502రు గల ఫ్లాట్ కు హద్దులు: **తూర్పు :** ఓపెన్ టు స్కై **దక్షిణం :** ఓపెన్ టు స్కై **పడమర:** కామన్ కారిడార్, మెట్లు మరియు లిఫ్ట్ **ఉత్తరం:** ఓపెన్ టు స్కై ఈ హద్దుల మధ్య చ.అ.1465లు ప్లింతేరియా, చ.అ.366లు కామన్ ఏరియా, చ.అ.100లు పార్కింగ్ ఏరియా

ఇట్లు
పిళ్ళా రవి, అడ్వకేట్ & నోటరీ
పిళ్ళా సురేఖ, అడ్వకేట్
సామారంగం చౌక్, విజయవాడ-520001. మొబైల్ : 9848110109

కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం


అవనిగడ్డలో కోట చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన కార్యా లయం వద్ద శ్రీనివాసరావు చిత్రపటానికి పూలదండలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణకు తోడ్పాటు ఇచ్చారని తెలిపారు. 1999లో విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు, అవనిగడ్డ ఎమ్మెల్యేగా తాను ఒకేసారి అసెంబ్లీలోకి వెళ్లినట్లు తెలిపారు. పార్టీలు వేరైనా ఇద్దరి మధ్యన బావ సారూప్యత ఉండేది అన్నారు. ఆయన అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి చదివారని గుర్తు చేశారు. ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు తెలుగు భాషను విధిగా బోధించాలని తాను అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టినట్లు దానికి ఆయన సంపూర్ణ మద్దతు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఏఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, బీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, మాజీ ఎంపీపీ బం డే కనకదుర్గ పాల్గొన్నారు

కోట శ్రీనివాసరావు మృతికి విక్కుర్తి సంతాపం

: సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల ప్రముఖ పారిశ్రామికవేత్త కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోట శ్రీనివాసరావు మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని తెలిపారు. వివిధ పాత్రలలో నటించి ఎంతమంది ప్రేక్షకుల ఆదరబి .మానాన్ని చూరగొని దశాబ్దాలపాటు సినీ నాటక రంగాలకు ఆయన చేసిన సేవ, ఆయన పోషించిన పాత్రలు చిరస్మరణీయ మన్నారు. తెరపై తన ఉనికిని ప్రదర్శించి ప్రతి పాత్రకు ప్రాణం పోసిన కోట శ్రీనివాసరావు మరణ వార్త బాధించిందన్నారు.

కంకిపాడులో నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం : తెలుగు సినీ రంగంలో విలక్షణ నటుడిగా తనదైన ముద్ర వేసుకున్న పద్మశ్రీ కోట శ్రీనివాసరావు మృతి దురదష్టకరమే కాదు. తీవ్ర బాధకారమని ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సినీ రంగంలో ఆయన లేని లోటును ఎవరూ భర్తీ చేయలేరన్నారు. ఈమేరకు కోట శ్రీనివాసరావు మతికి సంతాపం తెలిపారు. తెలుగు చలనచిత్ర రంగంలో కోట శ్రీనివాసరావు ఒక ప్రత్యేకతరహా నటుడిగా ప్రేక్షకుల హదయాల్లో ఎప్పటికీ గుర్తు వుండిపోయే చిరస్మరణీయమైన వ్యక్తి అన్నారు. సినీరంగంలో రాణించిన కోట రాజకీయ రంగంలో కూడా తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. నటుడుగా అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో నంది అవార్డులు పొందారు. నాలుగన్నర దశాబ్దాల పాటు సినీ లోకంలో ఎన్నో వైవిద్యమైన పాత్రలతో పలు భాషల్లో 750 సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించి జాతీయ స్థాయి నటుడిగా గుర్తింపు పొందారన్నారు. ఈ క్రమంలో భారత ప్రభుత్వం అందించే పద్మశ్రీ అవార్డ్ పొందటం ఎంతో విశేషం" అంటూ పేర్కొన్నారు. కోట శ్రీనివాస రావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు పెదఓగిరాలలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-ఉయ్యూరు : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు నిధులు పూర్తిస్థాయిలో ఉపయోగపడుతున్నాయో లేక దుర్వినియోగం అవుతున్నాయా అని తెలుసుకొని కేంద్ర పరిశీలన బందం ఉయ్యూరు మండలంలో విస్తతంగా పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర బందం సోమవారం మండలంలోని పెదఓగిరాల్లో పర్యటించి అభివద్ధి పనుల విధి విధానాలు ఇతర సంక్షేమ పథకాల అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించి స్థానిక ప్రజల నుండి వివరాలు అడిగి తెలుసుకోనున్నారని ఉయ్యూరు ఎంపీడీవో శేషగిరి రావు ఈ పర్యటనలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొం టారని దానికి అనుగుణంగా మండల స్థాయి గ్రామ స్థాయి అధికారులు తప్పక పాల్గొనాలని కోరారు.

చెత్త తరలించే వాహనాలు ప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో తాడిగడప మున్సిపాలిటీని డంపింగ్ ఫ్రీ మున్సిపాలిటీగా రూపొందిస్తామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి అన్నారు. ఆదివారం చెత్త తరలించే వాహనాన్ని తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో వారు ప్రారంభించారు. ఈసందర్భంగా పట్టాభి మాట్లాడుతూ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ నియోజకవర్గ అభివద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో రోజుకు 100 టన్నుల చెత్త వస్తోందని, దానిని తరలించడానికి ఈ వాహనాలను అందించినట్లు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

వాహనాలు ప్రారంభిస్తున్న పట్టాభి, బోడే ప్రసాద్

మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బంటుమిల్లి సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎమ్ భాస్కర రావు మొక్కల పంపిణీ చేశారు. పలువురికి కూరగాయలు మొక్కలు, విత్తనాలు అందజేశారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో మొక్కల పెంచుకోవడం వలన ఆక్సిజన్ పెంచడమే కాకుండా ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుందన్నారు. తాజా కూరగాయల తినడం వలన ఆరోగ్యం కాపాడుకో వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సంఘ అధ్యక్షులు చండిక గంగాజల్ రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పంచాయతీ కార్యదర్శికి సత్కారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : సింగలూరు గ్రామాభి .వృద్ధికి సహకరించి సేవలందించి బదిలీపై వెళుతున్న చంద్రాల పంచాయతీ కార్యదర్శి చాపరాలరాజేష్‌ను ఆదివారం ఆ గ్రామస్తులు సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బండారు శ్యామ్ కుమార్, వుద్దంటి నాగమల్లేశ్వరరావు, మాచర్ల రమణయ్య, కోటా పైడేశ్వరరావు, బిట్రా అర్జునరావు, తుమ్మలచర్ల లక్ష్మణరావు, ఆకురాతి హనుమంతరావు , గ్రామస్తులు పాల్గొన్నారు.

సొసైటీలలో ఎరువులు అందించాలి

ప్రజాశక్తి-మొవ్వ : సహకార పరపతి సంఘం సొసైటీల ద్వారా రైతులకు, కౌలు రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందించాలని ఏపీరైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలంనారాయణ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం కూచిపూడిలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యవసాయ సీజన్లో మండలంలో వరి నాట్లు ముమ్మరంగా సాగు చేస్తున్నారని, నాట్లు వేసిన రైతులకు కాంప్లెక్స్, యూరియా ఎరువులుకొరత లేకుండా చూడాలని కోరారు. మండలంలో కొన్ని సొసైటీలలోఒ మాత్రమే ఎరువులు రైతులకు అందిస్తున్నారనీ, కూచిపూడి లాంటి సొసైటీలో ఎరువులు అమ్మకాలు జరగటం లేదన్నారు. ఈ సొసైటీ పరిధిలో కూచిపూడి, పెదపూడి, యద్దనపూడి, పెడసనగల్లు, భట్ల పెనుమర్రు గ్రామాలు వున్నాయని, కూచిపూడి సొసైటీలో ఎరువులు విక్రయం లేనందున బయట మార్కెట్లో బ్లాక్ చేసి అధిక ధరలకు ఎరువులు షాపులు అమ్మకాలు కొనసాగిస్తు న్నారని వివరించారు. సొసైటీలో యూరియా కట్ట 250 రూపాయలు ఇస్తుంటే, బయట మార్కెట్లో ఎరువుల షాపులు వద్ద రూ.320 నుంచి రూ 370 వరకు అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయ అధికారులు, విజిలెన్స్ అధికారులు ఎరువుల దుకాణలు తనిఖీ చేసి పరిశీలించి, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దాడులు అప్రజాస్వామికం

ప్రజాశక్తి-మోపిదేవి : ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారికపై దాడికి కారణం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజా ఆదరణకు నిదర్శనమని మోపిదేవి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) అన్నారు. మోపిదేవి మండలంలోని నాగాయతిప్ప గ్రామ పంచాయతీలో గల తన స్వగృహంలో ఆదివారం వెంకటేశ్వరరావు పత్రికలతో మాట్లాడారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు.దాడులు అప్రజాస్వామికమని, మహిళలకు ఈ ప్రభుత్వం రక్షణ కల్పించాలని అన్నారు.

రొయ్యూరులో బాలుడు అదృశ్యం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని రొయ్యూరు గ్రామంలో శనివారం సాయంత్రం బాలుడు అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పామర్రు మండలం నిమ్మకూరు గ్రామానికి చెందిన పడమట దుర్గా శ్రీనివా సరావు, సరోజినీ కుమారుడు పడమట నిధీష్ (10) మండలంలోని రొయ్యూరు గ్రామంలో శనివారం సాయంత్రం అదశ్యమైయ్యాడు. శని, ఆదివారాలు రెండు రోజులు సెలవు కావడంతో నిదిష్ ను తన చెల్లిని మేనమామ వీరంకి బాలకష్ణ నిమ్మకూరు నుంచి రొయ్యూరు గ్రామానికి తీసుకువచ్చాడు. నిధీష్ సాయంత్రం నాలుగు గంటల 45 నిమిషాల నుంచి కనిపించకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వెతికారు. ఎంతసేపటికి కనిపించకపోవడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు బాలుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కే ఈ బి కెనాల్ పక్కనే ఉండటంతో కాలువలో పడి ఉంటాడా అనే కోణంలో వెతుకులాట మొదలుపెట్టారు. మరోపక్క చుట్టుపక్కల ఉన్న అన్ని రహదారుల వెంట సీసీ కెమెరాలు పరిశీలిస్తూ బాలుడు కోసం వెతుకులాట చర్యలు చేపట్టారు.

మంతెనలో వృద్ధురాలు దారుణ హత్య

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం మంతెన గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. వృద్ధురాలు తిరుమల స్వర్ణకుమారి (70)ను ఆదివారం ఆమె ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. దుండగులు ఆవిడ మెడకు వైరు చుట్టి చాకుతో మణికట్టు కోసి గొలుసు చేతి గాజులు అపహరించు కుపోయారు. మతురాలి భర్త పొలం నుంచి వచ్చి చూడగా ఆమె విగతజీవిగా కనిపించింది. సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే ఊరిలో ఒకే రోజు నాలుగు చోట్ల చోరీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఒకే గ్రామంలో ఒకే రోజు రాత్రి వరుసగా నాలుగు చోట్ల చోరీ జరిగిన ఘటన ఉయ్యూరు మండలంలోని ఆకునూరులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఉయ్యూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకునూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు గారపాటి కోటేశ్వరావు ఈనెల ఆరవ తేదీన ఇంటి నుండి కాశి యాత్రకు వెళ్లారు. తిరిగి 12 వ తేదీ ఉదయం తిరిగి వచ్చి చూడగా ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉంది. చోరీ జరిగిందని గుర్తించిన ఇంటి యజమాని లోనికి వెళ్లి చూడగా బీరువా తాళాలు సైతం పగలగొట్టి ఉన్నాయి. ఈ క్రమంలో బీరువాలో దాచిన 700 రూపాయలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో రూరల్ ఎస్సై సురేష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి చోరీ జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఇంటి యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మీడియాకు తెలిపారు. దీనికి తోడు అదే గ్రామంలో చోరీకి గురైన నివాసానికి దగ్గరలో ఉన్న మాజీ సర్పంచ్ కాకాని విజయ్ కుమార్ ఇంటి తోపాటు రైతు భరోసా కేంద్రం, అక్కడికి దగ్గరలో ఉన్న ఓ ఆర్ఎంపి వైద్యుని వైద్యశాల తాళాలు దుండగులు పగలగొట్టారు. దీంతో వరుస నాలుగు చోట్ల చోరీలు జరిగినట్లుగా గుర్తించారు. వైద్యశాలలో 1200 రూపాయలు చోరీకి గురైనట్లు తెలిపారు. దీంతో ఒకే గ్రామంలో వరసగా ఒకేరోజు నాలుగు చోట్ల దొంగతనం జరగడంపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ : పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల టాస్క్ ఫోర్స్ కార్యాలయాల్లో ఆయా పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్ లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొనకూడదని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తండ్రీ కొడుకులపై కత్తితో దాడి

ప్రజాశక్తి - వత్సవాయి : పాత కక్షలు నేపథ్యంలో తండ్రి కొడుకులపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలోని మంగొల్లు గ్రామంలో చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన రాయబారపు నాగేశ్వరరావు ఏసుబాబు తండ్రి కొడుకులు. వీరికి ఎ.జోజి అనే వ్యక్తితో పాత గొడవలున్నాయి ఈ నేపథ్యంలో నాగేశ్వరరావు ఏసుబాబు గ్రామ సెంటర్లో ఉండగా అప్పటికే జేబులో ఉన్న కత్తితో వారిపై జోజి దాడి చేశాడు. వారు అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈ ఘటనలో గాయపడిన నాగేశ్వరరావు ఏసుబాబులను చికిత్స నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమలు కాని హామీలిచ్చిన చంద్రబాబు

ప్రజాశక్తి - కంచికచర్ల : అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం అంటే కేరాఫ్ తనకు తానుగా నిరూపించుకున్న చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎంపి, వైసిపి జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ పేరుతో స్థానిక ఓసి క్లబ్ లో నందిగామ నియోజకవర్గం వైసీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు బండి మల్లికార్జున రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మోదుగుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ నందిగామలో రెడ్ పేరుతో వైసిపి నాయకులు, కార్యకర్తలపై టిడిపి నాయకులు అక్రమ కేసులు బనాయించటాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు మాట్లాడుతూ నందిగామలో అభివృద్ధి ని చేయకుండా టిడిపి ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు విధ్వంసకర పాలన చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గం ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పట్టణ వైసిపి అధ్యక్షుడు వేమా సురేష్, ఎంపిపిలు షేక్ మలక్ బషీర్, పెసర మల్లి రమాదేవి, కోటేరు శ్రీలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

వాస్తవ జీవన చిత్రణ 'పగిలిన జీవ కలలు'

పుస్తకావిష్కరణలో కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ ఎంఎండి ఇంతియాజ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రతిబింబిస్తూ వాస్తవ జీవన చిత్రణ ఎస్ఆర్ పృథ్వీ రచించిన పగిలిన జీవ కలలు పుస్తకంలో మనం చూస్తామని కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ ఎ ఎమ్ డి ఇంతియాజ్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, జిఆర్కె–పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త నిర్వహణలో విజయవాడ బుక్ ఫెస్టివల్ లైబ్రరీ హాల్లో ప్రముఖ కవి ఎస్ ఆర్ పృథ్వీ రచించిన పగిలిన జీవ కలలు, నానో ప్రస్థానం పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఇంతియాజ్ పిపగిలిన జీవ కలలు(దీర్ఘ కవిత) ఆవిష్కరణ చేసి మాట్లాడారు. సమాజ పరివర్తనకు ఉపకరించే సాహిత్యం రావాలని ఆకాంక్షించారు. నానో ప్రస్థానం ఆవిష్కరించిన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్వి.రమణ ప్రసంగిస్తూ స్వల్ప అక్షరాలతో అనల్పార్థాన్ని నానో కవితా ప్రక్రియలో చూస్తామన్నారు. అనేకమంది కవుల రచనాశైలి ని కవి ఎస్ఆర్ పద్య చక్కగా వివరించారని ప్రశంసించారు. ఆకాశవాణి పూర్వపు సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, ప్రముఖ కవయిత్రి కావూరి సత్యవతి ఈ పుస్తకాలను సమీక్షిస్తూ పాఠకులను ఆసక్తికరంగా చదివించే రచనలు అన్నారు. ప్రముఖ కవి శ్రీకంఠస్ఫూర్తి, ఎక్స్‌రే సాహిత్య కార్యదర్శి సింగంపల్లి అశోక్ కుమార్ చక్కని అభిభాషణతో కవిని అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన ఎక్స్ రే కొల్లూరి మాట్లాడుతూ సులభశైలిలో, అందరికీ అర్థం అయ్యేలా కవిత్వం ఉండాలన్నారు. జిఆర్కె పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణ రావు ప్రసంగిస్తూ సమాజాన్ని చైతన్యపరిచే రచనలను మనం స్వాగతించాలన్నారు. సిటిజన్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసారు. పుస్తక రచయిత ఎస్ఆర్ పృథ్వీ సత్కార అనంతరం ప్రసంగిస్తూ కవిగా తన ఆశయాలను వివరించారు. ఎక్స్ రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు తొలుత స్వాగతం పలుకుతూ అధ్యయనం ద్వారా మాత్రమే కవులు మంచి కవిత్వాన్ని సృజన చేయగలరు అన్నారు. ఎక్స్ రే కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, కొల్లూరి కనకవల్లి, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, పురాణం రాజేశ్వర శర్మ, పొత్తూరి సీతారామారావు కార్యక్రమ పర్యవేక్షణ చేశారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

51 వ డివిజన్లో 10 రోజులుగా తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కృష్ణానది చెంతనే ఉన్న విజయవాడ నగరవాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే కొండ ప్రాంత వాసులు గుక్కెడు నీరు తాగేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నామంటున్న కార్పొరేషన్ అధికారుల మాటలు నీటి మూటలు గానే మిగులుతున్నాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 51వ డివిజన్ కొత్తపేట శ్రీనివాస మహల్ వెనుక కొండ ప్రాంతవాసులు పది రోజులుగా ఎదుర్కొంటున్న నీటి కష్టాలను ఇందుకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. స్థానిక పడవల వారి వీధిలో మంచినీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడి తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్న మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. పది రోజులుగా మున్సిపల్ వాటర్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని, దీంతో గుక్కెడు నీరు తాగేందుకు కూడా నానా అవస్థలు పడాల్సి వస్తుందని స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరకొరగా వస్తున్న నీరు సైతం దుర్వాసన వెదజల్లడంతో ఎక్కడ ఆరోగ్యాలు దెబ్బతింటాయోనని భయభ్రాంతులకు గురవుతున్నట్లు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి తాగునీటి కష్టాలను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, 51వ డివిజన్ సిపిఎం అధ్యక్షురాలు కోరాడ వెంకటరత్నం, సెక్రటరీ కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కనకదుర్గమ్మకు విజయవాడ వన్‌టౌన్ పోలీసులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం సారె సమర్పించారు. విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వి.రాజశేఖర్ బాబు, వెస్ట్ ఏడిసిపి గుణ్ణం రామకృష్ణ, వెస్ట్ ఏసిపి దుర్గారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది సభ్యులు కుటుంబ సభ్యులందరూ తొలుత వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణం లోని దుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి ఇఒ శీనా నాయక్ సాదర స్వాగతం పలికారు. సిపి దంపతులకు దుర్గగుడి ఇఒ శేష వస్త్రం, చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈ క్రమంలో ఆదివారం ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో సుమారు 200 మంది బ్రాహ్మణ మహిళలు, అర్చక, పురోహిత, యువజన విభాగం ఆధ్వర్యంలో తరలి వచ్చి విద్యాధరపురం రావిచెట్టు సెంటర్ నుండి కాలి నడకన ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ మాట్లాడుతూ రెండేళ్లుగా దుర్గమ్మకు తమ సమాఖ్య తరపున సారె సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి హెచ్.కె.మనోహరరావు, మహిళా సంఘం అధ్యక్షురాలు కె.కుసుమకుమారి, ప్రధాన కార్యదర్శి కె.సూర్యకుమారి, కల్చరల్ సెక్రటరి గామోజీ అపర్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మంచినీరు బాటిల్స్, బిస్కెట్లు పంపిణీ

విజయవాడ ఇంద్రకీలాద్రి యాత్రికులతో అత్యంత రద్దీగా మారింది. ఆదివారం దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు విచ్చేసిన యాత్రికులతో దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంతో పాటు ఉపాలయాలు కిటకిటలాడాయి. దేవస్థాన క్యూలైన్లలో బారులు తీరిన యాత్రికులను పరిశీలించిన ఇఒ వి.కె.నాయక్ రూ.100, 300, 500 టికెట్ల జారీ నిలుపుదల చేసి అన్ని క్యూ లైన్లను ఉచిత దర్శనాలుగా ప్రకటించి దుర్గమ్మ దర్శనం యాత్రికులకు శీఘ్రంగా జరిగేలా పర్యవేక్షించారు షామియానాలు ఏర్పాటు చేయడంతో సహా వాటర్ బాటిల్స్, బిస్కెట్లను పంపిణీ చేశారు. దుర్గమ్మ నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన భోగవరపు సత్యనారాయణ మూర్తి లక్ష్మీ దంపతులు రూ.1,01,116 లు, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన శాంభవ సోలంకి రూ.1,52,000 చెక్కులను దేవస్థాన అధికారులకు అందజేశారు.

వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తిరువూరు : వైసిపి ఆంధ్రప్రదేశ్ బీసీ సెల్ రాష్ట్ర కార్య దర్శిగా తిరు వూరులోని సత్య కిరణ్ ఎక్స్ రే అండ్ ల్యాబ్ నిర్వాహ కులు కాలసాని గోపాల నాగేశ్వర రావు నియమితులయ్యారు. ఈ మేరకు అధినే త జగన్ నుండి నియామక ఉత్తర్వులు వచ్చి నట్లు నాగేశ్వర రావు ఆది వారం తెలిపారు. నన్ను గుర్తించి ఆంధ్ర ప్రదేశ్ బీసీ సెల్ కార్యదర్శిగా అవ కాశం కల్పించిన జగన్మోహన్ రెడ్డికి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాసు, జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్‌కి ఆంధ్రప్రదేశ్ బీసీ సెల్ అధ్యక్షులు రమేష్‌కి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

దొంగలు దొరికారు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఈ నెల నాల్గో తేదీన రెడ్డిగూడెం మండలం, కుదప గ్రామానికి చెందిన మహిళ నానుతాడును దొంగిలించి పరారైన ఇద్దరినీ పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరు పరచినట్లు మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. నిందితులు నామాల నాగరాజు, మోటపర్తి నాగరాజులకు గతంలో పలు నేరాలకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్లు ఆయన తెలిపారు.

హారికపై టిడిపి దాడి సిగ్గుచేటు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : టిడిపి కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం బీసీలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పి చైర్‌పర్సన్ ఉప్పలపాటి హారికపై గుడివాడలో జరిగిన దాడికి నిరసనగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మాజీ మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం సాయిరాం థియేటర్ సమీపంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి నివాసం వద్ద వైసీపీ నేతలు కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలోమాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు,మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైసిపి మండల అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. రెడ్డిగూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు పి.శ్రీనివాస్ రెడ్డి ఇంటి ఆవరణలో సమావేశంలో మాట్లాడారు. **వత్సవాయి :** జిల్లా పరిషత్ చైర్మన్ బీసీ మహిళలపై టిడిపి, జనసేన నాయకులు దాడి చేయడం చాలా నీచమైన చర్య అని రాష్ట్ర వైసీపీ మాజీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి అన్నారు. **మైలవరం :** రాష్ట్రంలో రెడ్బుక్కు రాజ్యాంగం అమలవుతుందని అనటానికి జడ్పీ చైర్పన్ ఉప్పల హారిక మీద దాడి నిదర్శనంగా నిలుస్తుందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో మండిపడ్డారు.

విలక్షణ నటుడు 'కోట'

- సుమారు 750పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు
- విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా వైవిధ్యమైన పాత్రలకు జీవం
- 2015లో పద్మశ్రీ అవార్డు స్వీకరణ
- 199-2004 వరకు తూర్పు నియోజకవర్గ ఎంఎల్ఏగా ప్రజాసేవ
- ఆయన మృతితో స్వస్థలం కంకిపాడులో విషాదఛాయలు

ప్రజాశక్తి-కంకిపాడు : ఎన్నో సినిమాలలో విలక్షణ పాత్రలు పోషించిన సినీ నటులు కోట శ్రీనివాసరావు మృతిపట్ల స్వగ్రామం కంకిపాడులో విషాదచాయలు అలముకొన్నాయి. కోట శ్రీనివాసరావు స్వస్థలం కష్ణాజిల్లా కంకిపాడు. సినీనటుడు కోట శ్రీనివాసరావు 1942, జులై 10న కృష్ణా జిల్లా కంకిపాడులో జన్మించారు. ఆయన తండ్రి కోట సీతారామాంజనేయులు వైద్యుడు. కోట శ్రీనివాసరావుకు ఒక అన్నయ్య నరసింహారావు, తమ్ముడు కోట శంకర్రావు ఉన్నారు. కోట శ్రీనివాసరావు బాల్యం నుంచి నాటకాలంటే ఆసక్తి. సినిమాలలోకి రాక ముందు ఆయన స్టేట్ బ్యాంక్లో పనిచేసేవారు.1966లో రుక్మిణిని వివాహం చేసుకున్నారు.

ఈయనకి ఇద్దరు కూతుర్లు, కుమారుడు. కుమారుడు కోట వెంకట ఆంజనేయ ప్రసాద్ అతను కూడా సినిమాల్లో నటించాడు 2010 జూన్లో రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. వైవిధ్యభరితమైన పాత్రలతో సినీ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న ప్రముఖ నటులు కోట శ్రీనివాసరావు సుమారు నాలుగు దశాబ్దాల పాటు సినీ, నాటక రంగాలకు ఆయన చేసిన కళా సేవ, ఆయన పోషించిన పాత్రలు చిరస్మరణీయం. విలన్ గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ఆయన పోషించిన ఎన్నో

స్వగ్రామం కంకిపాడులో కోట శ్రీనివాసరావు (ఫైల్)

మధురమైన పాత్రలు తెలుగు ప్రేక్షకుల మదిలో శాశ్వతంగా నిలిచిపోతాయి. క్రాంతి కుమార్ తీసిన 'ప్రాణం ఖరీదు' సినిమాతో ఆయన సినీ ప్రస్థానం మొదలై వైవిద్యమైన పాత్రలకు జీవం పోశారు. ముఖ్యంగా దర్శకులు జంధ్యాల తీసిన 'అహానా పెళ్ళంట' చిత్రంలో హీరోయిన్ తండ్రి పాత్రలో పిసినారిగా ఆయన నటన చిరకాలం ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది. ఆయన మతి తెలుగు సినీ రంగానికి తీరనిలోటుగా భావించవచ్చు. ఇప్పటివరకు ఆయన సుమారు 750 చిత్రాలలలో విభిన్న పాత్రలు పోషించారు. కోట శ్రీనివాసరావు భారత ప్రభుత్వం అందించే పద్మశ్రీ అవార్డును 2015లో అందుకున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నంది అవార్డులు కూడా అందుకున్నారు. అలాగే 1999-2004 వరకు విజయవాడ తూర్పు శాసనసభ్యుడిగా కూడా పనిచేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు హైదరాబాదులోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు.

కోట శ్రీనివాసరావు మృతి బాధాకరం, తుమ్మలపల్లి హరికష్ణ, టిడిపి సీనియర్ నాయకులు

కోట శ్రీనివాసరావు మరణం చాలా బాధాకరం. కోట కళా సేవ, పోషించిన పాత్రలు చిరస్మరణీయం. కోట మతి తెలుగు సినీ రంగానికి తీరని లోటు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా

మరణ వార్త నమ్మలేకున్నా : యలమంచిలి కిషోర్ బాబు

కోట శ్రీనివాసరావుతో మంచి అనుబంధం ఉంది. అప్పుడప్పుడు వివిధ విషయాల గురించి మాట్లాడు కుంటూ ఉండేవాళ్లం. ఆయన లేరని వార్తను నమ్మ లేకుండా ఉన్నాను.ఈ నెలలో కూడా రెండుసార్లు ఆయనతో మాట్లాడా. ఆయన ఆత్మ కు శాంతి కలగాలి.

ముమ్మరంగా డ్రైనేజీ పనులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పట్టణంలో ఆగిరపల్లి రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డ్రైనేజీ పనులు వేగవంతంగా సాగతున్నాయి. ఒక వైపు నిర్మాణ పనులు పూర్తి చేశారు. రెండో వైపు పనులు ఆదివారం చేపట్టారు. జాతీయ రహదారి నుండి బాబాయి హెటల్ వరకు నిర్మాణం జరుగుతోంది. అతర్వాత పనులు ముస్లీం పేట వరకు సాగుతుంది. ఈ పనులు పూర్తయిన తర్వాత రోడ్డు విస్తరణ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే పనల వల్ల మట్టి దిబ్బలు షాపుల ఎదుట పోయటంతో వ్యాపార దుకాణ ణాలు మూత వేయాల్సి వస్తుందని తెలిపారు. రోజుల తరబడి ఈవిధంగా చేయ డంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడామీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.



కొండపావులూరులో నీరు లేక ఎండిన చెరువు

ఎండిన సాగునీటి చెరువులు

- పోలవరం నీటితోనైనా నింపాలని రైతుల వేడుకోలు
- పశువులకూ తాగునీటి ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని మెట్ట గ్రామాల్లోని సాగునీటి చెరువులన్నీ ఎడారులుగా మారాయి. గత రెండు నెలలుగా సరైన వర్షం పడకపోవడంతో చెరువుల్లో నీరు రాలేదు. ఎండలు అధికంగా ఉండడంతో చెరువులన్నీ ఎండిపోయాయి. కొన్ని చెరువుల్లో కనీసం పశువులు తాగడానికి నీరు లేని దుస్థితి ఏర్పడింది. కనీసం పోలవరం జలాలతోనైనా చెరువులు నింపుతారని అనుకుంటే ఆపనీ చేయలేదు. పశుపోషకుల బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి. మండలంలోని మెట్ట గ్రామాల్లో 40 చెరువులున్నాయి. వీటిలో మైనర్ ఇరిగేషన్ చెరువులే అధికంగా ఉన్నాయి. బ్రహ్మయ్య లింగం చెరువు కూడా ఇందులోనే ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం చెరువుల్లో పూడిక తీతలకు అనుమతి ఇవ్వడంతో అక్కడక్కడ మట్టి తవ్వకాలు చేశారు. చెరువుల్లో పూడికలు సంగతి ఎలా ఉన్నా నీటితో చెరువులు నింపాలని రైతులు విన్నవిస్తున్నారు. ఎండలు అధికంగా ఉండటంతో ఎండిన చెరువుల్లో కరువు పను లు చేస్తున్నారు. బ్రహ్మయ్య లింగం చెరువు ఒక్కసారి నీటితో నిండితే 14 గ్రామాల్లో నీటిమట్టం పెరుగుతుంది. పోలవరం నీటితో చెరువులు నింపితే సాగునీటి సమస్య తీరుతుందని రైతులు తెలిపారు. చెరువుల అభివద్ధి పేరుతో ప్రతిసారి మట్టి తీస్తూనే ఉన్నారనీ,అయితే ప్రయోజనం ఉండడం లేదని రైతులు అంటున్నారు. ముస్తాబాదలో రెండు చెరువులు, పురుషోత్తపట్నంలో రెండు చెరువులు, బిబిగూడెం, కొండపావులూరు. వీరపనేని గూడెం, తెంపల్లి గ్రామాల్లో రెండేసి సాగునీటి చెరువులున్నాయి.

ఈచెరువులకు వర్షమే నీటి ఆధారంగా ఉంటుంది. అయితే పోలవరం కాలువ వచ్చిన తర్వాత మోటార్ల తో నీటిని పెట్టి పంటలు పండించారు. ఈ సీజన్లో వర్షాలు పడితేనే చెరువులకు నీరొస్తుంది. వర్షం లేకుంటే సాగు సమస్యగా మారుతుందని చెబు తున్నారు. ఈపరిస్థితుల్లో పోలవరం నీరు చెరువులకు మళ్లిస్తే ముందుగా పశువులు తాగునీటి సమస్యను అదిగమిస్తాయని, అతర్వాత సాగు సమస్య చూసుకోవచ్చని రైతులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి చెరువులు నింపడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెరువులు తక్షణమే నింపాలి
యం. ఆంజనేయులు, సిపిఎం మండల కార్యదర్శి

మెట్ట గ్రామాల్లో చెరువులు నింపడానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలి. చెరువుల్లో నీరుంటేనే సాగు జరుగుతుంది. నాలుగు ఏళ్లగా పోలవరం నీటిని మోటార్లతో పెట్టడం వల్ల సమస్య లేకుండా పోయింది. ప్రస్తుతం మోటర్లు పెట్టి నీటిని తోడే పరిస్థితి ఉంటుందా అన్న అనుమానం రైతుల వ్యక్తం అవుతుంది. వర్షాలు పడితే పర్వాలేదు కా నీ లేకుంటే సాగునీటి ఇబ్బంది వస్తుంది. పోలవరం కాలువ నుండి నీటిని చెరువులకు మళ్లించాలి.పశు వులకు తాగు నీరు లేకపోవడంతో అంతా సమస్య వస్తుంది. చెరువులకు నీరు పెట్టడానికి చర్యలు తీసుకోవాలి.

వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ సబ్‌జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశమై ఆరు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సబ్‌జోన్ అధ్యక్షులుగా ఎదురు మొండి పిడి బి వెంకటేశ్వరరావును, కార్యదర్శిగా తలకడ దీవి పిడి బిపిఎల్ ప్రసాదును, ట్రెజరర్ గా పెదకండేపల్లి పీడీ టి నవీన్ ను ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గాన్ని అవనిగడ్డ నియోజక`వర్గంలోని ఆరు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు. విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయులు కోసూరు పూర్ణచంద్రరావుపాటు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో వ్యాయామ విద్యాభివద్ధికి కషి చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులు సూచించారు.

నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో ఉన్న అమ్మ వయో వృద్ధులు సేవ సధనంలో ఆదివారం లయన్స్ క్లబ్ అఫ్ విజయవాడ రూరల్ సెక్రెటరీ లయన్ ఇంజనీర్ రావి సురేష్ బాబు ఆధ్వర్యంలో పది వేలు రూపాయలు పైగా విలువైన నిత్యావసర సరుకులు, పాలు గుడ్డులు, కూరగాయలు, మందులు పంపిణీచేసి మూడు వేలు రూపాయలు చెక్ అందచేశారు. అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రావి సురేష్ బాబు మాట్లాడుతూ 26 సంవత్సరల ప్రజాసేవ నాకు ఎంతో సంతప్తినిచ్చిందన్నారు. 100పైగా గ్రామాలలో 130పైగా ఉచిత మెడికల్ క్యాంపులు, నిర్వహించి అవసరమయిన వారికి ఉచితంగా మందులు,కళ్ళ ఆపరేషన్లు చేపించి కళ్ళజోడులు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అఫ్ విజయవాడ రూరల్ అధ్యక్షులు లయన్ పి. కిరణ్ కుమార్, ట్రెజరీ లయన్ కే.యస్.ఆర్.కే. ప్రసాద్ డాక్టర్. లోయ సురేంద్ర, డాక్టర్. డి. సువర్ణ బాబు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు తగదు : బండి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : రాజకీయమంటే ప్రజలకు సేవ చేయడం గాని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం కాదని ఉమ్మడి కృష్ణాజిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మచిలీపట్నం జన సేన నియోజకవర్గం ఇన్చార్జి బండి రామకృష్ణ పేర్కొ న్నారు. ఆదివారం బందరులో జనసేన పార్టీ పీఏసీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నత హెదాల్లో పదవులు అనుభవించిన వ్యక్తులు నేడు అధికారం కోల్పోయేసరికి దిగజారి ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం దారుణం అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు చేసే విమర్శలు సద్విమర్శలుగా ఉంటే ప్రభుత్వం స్వీకరించి తమ విధానాలను సరిదిద్దుకోవడానికి ఉపయోగపడుతుంది, అలాగే ప్రజల మన్ననలను పొందడానికి కూడా దోహదపడుతుందన్నారు. పెదయాదర సర్పంచ్ గళ్ళ తిమోతి, మచిలీపట్నం జనసేన నగర అధ్యక్షులు గడ్డం రాజు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి వత్సవాయి : ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు తూనం రమేష్ కుటుంబాన్ని వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు పరామర్శించారు. రమేష్ చిత్రపటానికి ముందుగా నివాళు లర్పించారు. ఆదివారం వత్సవాయి మండలంలోని, పెంట్యాల వారి గూడెం గ్రామంలో మృతుని ఇంటికి నాయకులతో కలిసి వెళ్లిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం నుంచి సరైన గిట్టుబాటు ధర లేకపోవడం, పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో, అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి దారి తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. సుమారు రూ.12 లక్షల వరకు అప్పుల పాలయ్యాడని తెలిపారు. రమేష్ కుటుంబానికి సానుభూతి తెలిపిన వారిలో మండల అధ్యక్షులు గూత్తా శంకర్రావు, ఎంపిపి గొలుసు రమాదేవి,

రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబురి రవి, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఏలూరి శివాజీ, జిల్లా కార్యదర్శి రూప్లా నాయక్, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు నర్మనేని వెంకటేష్, తదితరులున్నారు.

ట్రై సైకిళ్లు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : టిడిపి సమన్వయ కర్త శ్రీరాం ధనుంజయ (చిన్నబాబు) పుట్టినరోజు సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గం వికలాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. ఆదివారం ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ నివాసంలో తాతయ్య కుమారుడు శ్రీరాం కృష్ణ పవన్ బూదవాడ అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ కాంట్రాక్టర్స్ గొల్ల గోపి, నవీన్ ఆర్థిక సహకారంతో స్వయంశక్తి వికలాంగుల సంక్షేమ అభివృద్ధి సంఘంలోని 10 మంది వికలాంగులకు మూడు చక్రాల బండ్లు జగ్గయ్యపేట ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కుమారుడు శ్రీరాం కృష్ణ పవన్ చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ గొనె విజయలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ కొండపల్లి కోటేశ్వరరావు, జగ్గయ్యపేట ప్రముఖులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయాభివృద్ధికి శ్రీకారం

ప్రజాశక్తి - విస్సన్నపేట : మండల కేంద్రంలో ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణ గత కొంత కాలంగా వర్షాధారణ సమయంలో పూర్తిగా నీలమయమై కార్యాలయం ఆవరణ అంతా చెరువులను తలపిస్తుంది. ప్రభుత్వ కార్యాలయాలు మండల ప్రజా పరిషత్, రెవెన్యూ, విద్యాశాఖ, ఉపాధి హామీ, వెలుగు, 108, హౌసింగ్ కార్యాలయాలు ఒకే చోట ఉండటం వలన ప్రతిరోజు నిత్యం ఏదో ఒక సమస్యతో ప్రజలు ఈ కార్యాలయాలకు వచ్చి వెళ్ళటం తప్పనిసరి. వర్షాల ప్రభావంతో వర్షం వచ్చినప్పుడల్లా కార్యాలయాల ఆవరణ మొత్తం నీటితో నిండిపోవడంతో ప్రజల రాకపోకలకు కార్యాలయ సిబ్బంది వాహనాల రాకపోకలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గమనించి ప్రముఖ కాంట్రాక్టర్ టిడిపి సీనియర్ నాయకులు లయన్ డాక్టర్ ఎన్‌టి వెంకటేశ్వరరావు సొంత నిధులతో ఆదివారం కార్యాలయ ప్రాంగణంలో చిప్స్ పోయించారు. కార్యాలయ ఆవరణను అభివృద్ధి చేసి ప్రజలకు అసౌకర్యాన్ని తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని లలిత రామకృష్ణ వెంకట్రావు దగ్గరుండి పర్యవేక్షించారు.

కార్యాలయ ప్రాంగణంలో చిప్స్ పోసి సరిచేస్తున్న దృశ్యం

ఇంటింటికీ టిడిపి

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామంలో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు పాల్గొని టిడిపి అధ్యక్షులు పులపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ ఎన్‌టి.వెంకటేశ్వరరావు, గొట్టేటి సుబ్రమణ్యేశ్వరరావు (బుడ్డయ్య), వీరమాచినేని కృష్ణప్రసాద్, కోలేటి రంగారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి అయిన సందర్భంగా మండలంలోని బూదవాడ గ్రామంలో చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి వారి కష్టసుఖాలు, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, జగ్గయ్యపేట నియోజకవర్గం పరిశీలకులు కలకొండ విజయబాబు, మండల అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, గ్రామ సర్పంచ్ గుగులోతు లక్ష్మీ బాలాజీ, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గడ్డం హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

'బుద్ధునితో నా ప్రయాణం' నాటక కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌ని ఆదివారం ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వై.హరిబాబు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 22వ తేదీ విజయవాడలోని సిద్ధార్థ కాలేజ్ మొగల్రాజపురంలో 'బుద్ధినితో నా ప్రయాణం నాటక ప్రదర్శన' కరపత్రాన్ని ఆవిష్కరించి ఆయనని ముఖ్యఅతిథిగా ది బుద్ధిష్టి సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ తరపున ఆయనను నాటకాన్ని వీక్షించాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఐ జాతీయ కార్యదర్శి వై.కొండలరావు, బిఎస్ఐ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గురునంద, ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెక్రటరీ జవాజి ఫణీంద్ర కుమార్ పాల్గొన్నారు.

శనగపాడు సప్లై ఛానల్ ద్వారా సాగునీరందించాలి

ప్రజాశక్తి - నందిగామ : శనగపాడు సప్లై ఛానల్ ద్వారా తక్షణమే సాగునీరు అందించి మాగాని పంటలను కాపాడాలని సిపిఎం నందిగామ పట్టణ కమిటీ సభ్యులు కర్రీ వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కర్రీ వెంకటేశ్వరావు ప్రకటన ద్వారా తెలిపారు. నందిగామ మండలం అనాసాగరం గ్రామంలో జులై నెల 15కు నీళ్లు వస్తాయని ఇప్పటివరకు ఏటి కాలవ కింద నారుమడులు పోయలేదన్నారు. నారు ఎదిగి నాటుకు వచ్చే సమయంలో నీరు లేక పొలాలు ఎండిపోతున్నాయన్నారు. శనగపాడు సప్లై ఛానల్ పరిధిలో 250 ఎకరాల సాగు విస్తీర్ణం ఉందన్నారు. నీటి సంఘాల అధ్యక్షులు తక్షణమే స్పందించి సప్లై ఛానల్ మరమ్మతులు చేసి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని అన్నిగిండ్లపాడు గ్రామంలో సర్వే నంబర్ 436/ఎ పై నిబంధనలకు విరుద్ధంగా సర్వే నిర్వహించిన తహశీల్దార్, గ్రామ సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలని ఆ గ్రామ రైతు యానాల కోటేశ్వరరావు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ దాఖలు సర్వే నెంబర్ 436లో ఆరు ఎకరాల 63 సెంట్లు భూమి కలిగి ఉంటే నాగమణి కోసం సర్వే నంబర్ 436/ఏగా ఒక ఎకరం సెంట్లు భూమికి సర్వేలు ఏ విధంగా నిర్వహించారని ప్రశ్నించారు. దరఖాస్తు చేసిన మీదట ప్రాథమికంగా రెవెన్యూ రికార్డులను పరిశీలించి పెనుగంచిప్రోలు తహశీల్దార్ ఆదేశాలు ఇవ్వాల్సి ఉండగా కొందరితో లాలూచీపడి గ్రామ సర్వేలకు ఆదేశాలు ఇచ్చి సర్వే కార్యక్రమాన్ని చుట్టు పక్కల రైతులందరికీ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వకుండానే తూతూ మంత్రంగా ముగించినట్లు తెలిపారు. ఎఫ్ఎంబిలో లేని సర్వే నెంబర్ కాకుండా ఇతర ప్రైవేట్ రైతులకు సంబంధించిన భూమిపై సర్వే నిర్వహించడంతో తనకు తీవ్ర నష్టంతో పాటు అవమానం కలిగిందని యానాల కోటేశ్వరావు ఆగ్రహ వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన తహశీల్దార్ తో పాటు సర్వేయర్‌పై దిగిన చర్యలు తీసుకోవాలని జరిగిన నష్టాన్ని వారి నుంచి ఇప్పించాల్సిందిగా కోరారు.

సేవా సమాఖ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కమ్మవారి సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సామాజిక సేవకార్యక్రమాలు విస్తృతం చేసేందుకు ప్రతీఒక్క కమ్మ సామాజిక మేధావులు పెద్దలు ముందుకురావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. విజయవాడ గురునానాక్ కాలనీలోని ఫన్ టైమ్స్ రిక్రియేషన్ సెంటర్లో ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవాసమాఖ్య రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని

జిల్లాలనుండి సభ్యులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన అనంతరం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మండవ రమ సంధానకర్తగా వ్యవహరించారు. కార్యక్రమానికి కమ్మవారి సేవా సమాఖ్య గౌరవ అధ్యక్షులు డాక్టర్ గన్ని భాస్కరరావు సభా అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ చాలావరకు ఐక్యత లేకపోవడం వల్ల అనేక కార్యక్రమాలు చేయటానికి సాధ్యపడటం లేదని, పెద్దలు సభ్యుల సహకారంతో ఆర్థికంగా నిధి సేకరణ చేసి మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు కషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమాలు జరిపేటప్పుడు అనేక సమస్యలు,సవాళ్లు ఎదురైనప్పటికీ కమ్మవారి సేవా సమాఖ్య ఆధ్వర్యంలో మరింత అభివద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సమాయత్తం అయ్యేందుకు ఈ సమావేశం దోహద పడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గూడూరు సత్యనా రాయణ, సూరపనేని స్వరూప రాణి, మందలపు జగదీష్, పాల్గొన్నారు.

వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

అన్నదానం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం, రంగాపురం గ్రామ శివారు బూరుగగూడెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రామినేని వెంకటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులచే "ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ" స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో నిరుపేదలైన వారికి ప్రేమవిందు (అన్నసంతర్పణ) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రావ్యలక్ష్మి, బాబిఛరణ్ నాయుడు, గగన్, మణికంఠ, పాల్గొన్నారు. వారికి సంస్థ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

సత్యమ్మకు సారె

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం ఐతవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మ వారికి అషాఢ మాసం సందర్భంగా సారె సమర్పించారు. ఐతవరం గ్రామానికి చెందిన మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు అధ్వర్యంలో గ్రామానికి చెందిన మహిళలు చీర పసుపు కుంకుమ పూలు పండ్లు మేళతాళాలతో ఉరేగింపుగా అమ్మవారి అలయానికి వచ్చి అషాఢ బోణాలు సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం కోదాడ పట్టణానికి చెందిన నండూరీ వేద మనోజ్ఞ రూ.25,116 లు, కృష్ణా జిల్లా మొవ్వ మండలం నిడుమోలు గ్రామానికి చెందిన ఎండూరి లిఖిత, రమ్య రూ.14,116 లు విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

మొక్కలు నాటిన దృశ్యం

వన మహోత్సవం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వినూత్న వెల్ఫేర్ ట్రస్ట్ కొండపల్లి ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కొండపల్లి మునిసిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఎంఆర్పిఎస్ రాష్ట్ర కో కన్వీనర్ మానికొండ శ్రీధర్, అక్కల రామ్మోహన్ రావు (గాంధీ), వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, దొడ్డాకుల వెంకటేశ్వరరావు, కాటమరాజు దుర్గా భవాని పాల్గొని మొక్కలు నాటారు.

ఉప్పాల హారికపై దాడి హేయం : వైసిపి

అవనిగడ్డలో విలేకర్లుతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

గుడివాడలో విలేకర్లుతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారికపై గుడివాడలో శనివారం జరిపిన దాడి హేయమైన చర్య అని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మండిపడ్డారు. ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం, రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. ఎస్సీ, బీసీ వ్యతిరేకి అయిన చంద్రబాబు మార్గంలోనే ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పనిచేస్తూ బీసీ మహిళ అయిన జడ్పీ చైర్ పర్సన్ పై దాడి చేయడం కూటమి ప్రభుత్వ అరాచకత్వానికి నిదర్శనం అన్నారు. పోలీసుల ముందే గంటకు పైగా వారి నిర్బంధించి తీవ్ర భయభ్రాంతులకు గురి చేశారంటే రాష్ట్రంలో ఎలాంటి పాలన నడుస్తుందో అర్థమవుతుందన్నారు. రైతాంగ సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పర్యటనలకు విశేష ప్రజాదరణ లభించడంతో కూటమి నాయకులు వైఎస్ఆర్సిపి నాయకులపై భౌతిక దాడులకు దిగుతున్నారన్నారు. ఇలాంటి దాడులకు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు భయపడరు అన్నారు. ఏపీ గౌడ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చల్లపల్లి జడ్పిటిసి రాజులపాటి కళ్యాణి, కోడూరు ఎంపిపి కొండవీటి వెంకట కుమారి, అవనిగడ్డ జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏపీ గౌడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, వైఎస్ఆర్సిపి వ్యవసాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణ, రామచంద్రపురం సర్పంచ్ వాకా రమేష్, మండల పార్టీ ఉపాధ్యక్షులు పులిగడ్డ ఇచ్చేశ్వరరావు పాల్గొన్నారు

బడే గౌతం ఖండన : అలాగే జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారి కపై దాడిని ఆ పార్టీ నియోజకవర్గ యువ నాయకులు వైసీపీ నేత బడే గౌతం తీవ్రంగా ఖండించారు. ఎప్పుడూ ఎవరిపై వ్యక్తిగత దూషణలు చేయకుండా సౌమ్య రాలుగా ఉండే ఉప్పాల హారికపై దాడి ఈ రాష్ట్రంలోని మహిళలపై ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నాయకులు సమావేశాలు నిర్వహించి ఓటమి ప్రభుత్వ మోసపూరిత విధానాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరిస్తుంటే దానిని సహించలేని కూటమి ప్రభుత్వం నాయకులు ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. అదేవిధంగా పార్టీ వ్యవసాయ విభాగం రీజనల్ కమిటీ కన్వీనర్ దివి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు కూడా హారిక పై జరిగిన దాడిని ఖండించారు. **ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడలో జరిగిన అల్లర్లు, జడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై జరిగిన దాడి హేయమైన చర్య అని వైసిపి నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మట్టా జాన్ విక్టర్, ఎంపీపీ పెయ్యల ఆదాం, నాయకులు ఎంవి నారాయణరెడ్డి, మండలి హనుమంతరావు, షేక్ సయ్యద్‌లు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, మైనార్టీల ఓట్లతో అధికారంలోకి వచ్చి నేడు వారిపైనే దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. జడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై జరిగిన దాడి ప్రభుత్వంపై చేసిన దాడిగా భావిస్తున్నామని వెంటనే సిఎం చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసభ్య పదజాలంతో మాట్లాడుతూ దాడులకు దిగిన కూటమి అల్లరి మూకలపై పోలీసులు కేసులు నమోదు చెయ్యాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు షేక్ బాజీ, కందుల నాగరాజు, జడ్పిటిసి గొర్ల రామకష్ణ, చుండూరి శేఖర్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** శనివారం గుడివాడలో ఉప్పాల హారిక మీద కూటమి పార్టీకి చెందిన అల్లరిమూకలు చేసిన దాడిని గుడ్లవల్లేరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖండించారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రమైన గుడ్లవల్లేరు నెహ్రూ నగర్ లోని యువజన విభాగం అధ్యక్షుడు గుదే రవి స్వగృహంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మహిళపై జరిగిన ఆ దుశ్చర్యను ఖండిస్తూ ఇలాంటి చర్యలు మరలా జరగకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మెరుగు మాల కాశీ, పాలేటి చంటి , సాయన రవి , కోటప్రోలు నాగు తదితరులు పాల్గొన్నారు.

విలేకర్లుతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రాజకీయ లబ్ధి కోసమే హారిక దంపతుల డ్రామాలు : టిడిపి

ప్రజాశక్తి - గుడివాడ : రాజకీయ లబ్ది కోసమే జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త రాములు డ్రామాలు ఆడుతున్నారని టిడిపి బిసి నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాము ఆదేశాలతోనే మేమంతా సమన్వయంతో ఉన్నామన్నారు. లేకుంటే వైసీపీ సమావేశం జరిగి ఉండేది కాదన్నారు. మహిళ అనే గౌరవంతో ఇతర మార్గాల్లో కే కన్వెన్షన్‌కు వెళ్లాలని ఉప్పాల హారికకు పదేపదే చెప్పామని, ఉప్పాల హారికను టిడిపి శ్రేణులు ఎవరూ పల్లెత్తు మాట కూడా అనలేదన్నారు. ఈ వివాదం జరుగుతున్నంత సేపు తాము అక్కడే ఉన్నామన్నారు. వైకాపా అధికారంలో ఉండగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సమావేశాలకు వెళ్లకుండా అడ్డుకున్న సందర్భాలు లేవా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు వసంతవాడ దుర్గారావు, యార్లగడ్డ సుధారాణి, గొర్ల శ్రీలక్ష్మి, ఈడే మోహన్, దేవరపల్లి కోటి, ఆర్నేపల్లి పండు, లోయ విజయ్, సురగాని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొల్లు కుటుంబం గురించి మాట్లాడితే సహించం : టిడిపి

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : కొల్లు కుటుంబం గురించి అడ్డగోలుగా మాట్లాడినా, మాట్లాడించినా క్షమించేది లేదని మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లా డుతూ వైసీపీ నేతల వ్యాఖ్యల్ని ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఉంటూ రౌడీల్లా వ్యవహరిస్తున్న పేర్ని నాని, పేర్ని కిట్టూకి ప్రజలు చీకొట్టినా ఇంకా మారలేదన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా, ఏఎంసీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పంచపరవాల కాశీవిశ్వనాథం, టీడీపీ నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

బందరులో విలేకర్లుతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఉద్దేశపూర్వకంగానే వైసిపి కార్యకర్తలపై దాడులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కూటమి ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే దాడులు నిర్వహిస్తోందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాన్ బెన్నీ లింగం అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో మాట్లాడుతూ శని వారం గుడివాడలో వైసిపి కార్యకర్తలపై కావాలనే భౌతికమైన దాడులకు దిగారన్నారు. మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికు రాష్ట్రంలో పెరుగు తున్న ఆదరణను చూసి ఓర్వ లేని కూటమి ప్రభుత్వం పోలీసుల సమక్షంలోనే కార్యకర్తలపై దాడి చేస్తున్నా వారు ప్రేక్షక పాత్ర వహించాల్సి వచ్చింద న్నారు. కృష్ణాజిల్లా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా ఉన్న ఉప్పాల హారిక వాహనంపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నామన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రభుత్వం తుంగలో తొక్కేస్తోందన్నారు.

ఆలయంలో రద్దీ

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆదాయం రూ.10.40 లక్షలు

ప్రజాశక్తి-మోపిదేవి : ప్రసిద్ధ సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి క్షేత్రంగా నిరంజన్ మోపిదేవి దేవాలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం ఒక్కరోజే 13666 మంది భక్తులు స్వామి సేవలో తరించగా 10 లక్షల 40వేల 737 రూపాయలు ఆదాయం వచ్చిందని దేవస్థానం కమిషనర్ ఆలయ కార్ నిర్వహణ అధికారి దాసరి శ్రీరామ ప్రసాదరావు తెలిపారు. శాశ్వత అన్నదానం కార్యక్రమం నిమిత్తం 95,364 రూపాయలు, నిత్య అన్నదాన కార్యక్రమం నిమిత్తం 82,210 రూపా యలు, స్వామి వారి కళ్యాణ కట్ట టిక్కెట్ల ద్వారా 15,960 రూపాయలు.(లడ్డు, పులిహోరా -) విక్రయం ద్వారా 1,62,015 రూపాయలు, స్వామి దర్శనం ద్వారా వచ్చిన రుసుము 74,000 రూపాయలు, వివిధ సేవా టిక్కెట్ల ద్వారా వచ్చిన రుసుము 6,09,888 రూపాయలు. మొత్తం రుసుము 10,40,737 రూపాయలు గా ఆలయ అధికా రులు పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం : సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానానికి విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. ఆదివారం విజయవాడకు చెందిన బి. రాశి హర్షణి దంపతులు అన్నదానం నిమిత్తం 50,116 రూపాయల డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వా హణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకి అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దివి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వీరబాబుకు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఎంపికైన రాజనాల వీరబాబుకు మహిళా నాయకులు శు భాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఆదివారం తెలుగు మహిళా నాయకులు మాజీ ఎంపీపీ బం కనకదుర్గ, మాజీ కనకదుర్గమ్మ అమ్మవారి టెంపుల్ డైరెక్టర్ విశ్వనాథపల్లి పాప, ప్రభుత్వ వైద్యశాల అభివద్ధి కమిటీ సభ్యులు బచ్చు కష్ణకుమారి, వీరబాబుకు శు భాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కంకిపాడు : తాడిగడపడలోని శ్రీ నగరకట్ట ప్రాంతంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పెనమలూరు శాసన సభ్యులు బోడే ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను స్థానికులకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఎంఎల్ఏ

పి4 లక్ష్యాలు పూర్తి చేయలేదని కార్యదర్శులకు వేతనాలు నిలిపివేత

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బంగారు కుటుంబాల గుర్తింపు లక్ష్యాలను చేరుకోలేదనే సాకుతో పంచాయతీ కార్య దర్శులు వేతనాలను నిలిపివేసిన సంఘటన కృష్ణాజిల్లా మొవ్వ మండలంలో చోటు చేసుకుంది. పేదవారిని గుర్తించి వారిని దత్తత తీసుకుని మార్గదర్శకులు ఎంపిక చేసి వారి ద్వారా బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పి ఫోర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ పథకం పట్ల క్షేత్ర స్థాయిలో అమలు కావాలంటే కొంత సమయం పడుతుంది ఇవేమీ ఆలోచించని సంబంధిత మండల పరిషత్ అభివద్ధి అధికారి లక్ష్యాలను అధిగమించలేదని సాగుతో కార్యదర్శిల వేతనాలు నిలిపివేసి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా మీరు సరిగ్గా పని చేయడలేదు.. మీ వల్లే గత మండల పరిషత్ అభివద్ధి అధికారి వెళ్లిపోయారు. నేను అలా కాదు మీరు ఎట్లా ఉద్యోగాలు చేస్తారో నేను చూస్తాను అని బెదిరింపు ధోరణిలో మాట్లాడంతో కార్యదర్శులకు తమ బాధ ఎవరికి చెప్పాలో తెలియక లోలోపల మదన పడుతున్నారు .

గ్రామాలలో పేద కుటుంబాలను దత్తత తీసుకునే వారిని గుర్తించాలి అంటే కార్యదర్శులకు ఒక్కళ్ళ వల్ల అయ్యే పని కాదు. దానికి ప్రజా ప్రతి నిధుల నుండి పూర్తి సహకారం కావాలి. వారు ప్రభుత్వ లక్ష్యాన్ని అర్థం చేసుకుని మండల, గ్రామ స్థాయిలో సహకరిస్తేనే ఈ పథకం పూర్తి లక్ష్యాలను చేరుకుంటుందనేది సత్యం. అలా కాకుండా సంబంధిత మండల పరిషత్ అభివద్ధి అధికారి.. కార్యదర్శుల వేతనాలు నిలిపివేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మొత్తం మండల పరిధిలో 21 గ్రామ పంచాయతీలు, 16 సచివాలయాలు ఉన్నాయి.వీటి పరిధిలో అన్ని క్యాడర్లు కలిపి సుమారు 150 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో సుమారు 30 మంది ఉద్యోగుల వరకు వేతనాలు నిలిపి వేశారు. అసలే తక్కువ వేతనాలు అవి కూడా ఇలాంటి కారణాలతో ఆపేస్తే తమ కుటుంబాలు ఎలా బ్రతుకుతాయని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల పట్ల సంబధిత అధికారి వ్యవహరిస్తున్న తీరును జిల్లా కలక్టర్ దష్టికి తీసుకు వెళ్లేందుకు ఉద్యోగులు సిద్ధమయ్యారు. అయితే కలక్టర్ కు పిర్యాదు చేస్తే నేను ఊరుకుంటానా. మీరు ఎలా ఉద్యోగాలు చేస్తారో నేను చూస్తానని బెదిరింపు ధోరణికి పాల్పడుతున్నట్లు పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. కాబట్టి అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కార్యదర్శులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

బెల్ట్ గ్రేడింగ్ కరాటే నిర్వహణ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఆర్యవైశ్య కళ్యాణమండపంలో హర్ష కరాటే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ కరాటే కార్యక్రమం నిర్వహించారు. కరాటే వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఆత్మవిశ్వాసం, క్రమ శిక్షణ పెరుగుతుందని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. కరాటేలో ఎన్నో పథకాలు సాధించి మన తిరువూరుకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కరాటే ఇనిస్టిట్యూట్ సీనియర్ కోచ్ ఎం.నాగేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్యాంసుందర్, సబ్ ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ గుడిమెట్ల మురళి, డాక్టర్ ప్రేమ్ చంద్, కొల్లిపర సుబ్బారావు పాల్గొన్నారు.

కొండపల్లిలో కబడ్డీ అకాడమీ ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లిలో కబడ్డీ అకాడమీని ముఖ్యఅతిథిగా హాజరైన జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ) ప్రారంభించారు. కబడ్డీ కోచ్‌లు చట్టి శ్రీను, శ్రీరామ ఈశ్వర్, అశ్వజిత్ ప్రసాద్ ఆధ్వర్యంలో అకాడమీ ప్రారంభించారు. జాతీయస్థాయి పోటీలకు కబడ్డీ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా అకాడమీ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎర్రంశెట్టి నాని, భాను ప్రకాష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ దొంగతనం కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : చోరీకి గురైన ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం... ఈనెల 9న భవానిపురం పోలీస్ స్టేషన్ ఏరియాలోని జోజి నగర్ చర్చి సెంటర్ దగ్గరలో గల నయార పెట్రోల్ బంక్ ఎదురుగా పార్క్ చేసియున్న ట్రాక్టర్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు సంఘటనా స్థలాలకు చేరుకొని విచారణ క్రమంలో స్థానిక సీసీ ఫుటేజ్ ఆధారాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. విజయవాడ వెస్ట్ డివిజన్ ఎసిపి దుర్గారావు పర్యవేక్షణలో భవానీపురం టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.ఉమా మహేశ్వరరావు, సిబ్బంది కలిసి బృందాలుగా ఏర్పడి సిసి కెమెరాల ఆధారంగా ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తి కంటైనర్‌లో ఎక్కించి దొంగిలించుకొని పారిపోయినట్లు గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా కొన్ని గంటల్లోనే అనుమానిత వ్యక్తిని సత్య సాయి జిల్లా, అమ్మవారిపాలెం, కియా ఇండస్ట్రీయల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కంటైనర్‌ను, రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ రాజీవ్ సింగ్ పరమార్ అలియాస్ రాజీవ్‌ను అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి - విజయవాడ : స్మార్ట్ మీటర్లను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మాత్రం ఇళ్ళకు బిగించేందుకు సిద్ధమయ్యిందని, వినియోగదారుల అనుమతిలేకుండా ఇళ్ళకు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, సిపిఎం రాష్ట్ర కమిటీసభ్యులు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. 21వ డివిజన్ కల్పన ప్రింట్స్ రోడ్డులో స్మార్ట్ మీటర్లు పెట్టడానికి నిరసనగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీనాథ్, తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ పాల్గొని మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం బాటలో కూటమి ప్రభుత్వం నడుస్తుంది. కరెంట్ ఛార్జీలు, భారాలు, స్మార్ట్ మీటర్ల విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా సంవత్సర కాలంలో ప్రజలపై రూ.14,487 కోట్ల భారం అదనపు విద్యుత్ చార్జీల పేరుతో మోపిందన్నారు. కరెంట్ బిల్లులు పెరిగిపోయి ప్రజలు గగ్గోలు పెడుతున్నారన్నారు. ప్రజలు భారాలతో ఇబ్బందులు పడుతున్నా ఈ ప్రభుత్వానికి చలనం లేదని, పైగా బాగున్న మీటర్లు తొలగించి అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లను ఇళ్ళకు పెడుతున్నారన్నారు. అదానీ కోసం కుట్రపూరితంగా మోడీ అండతో కూటమి ప్రభుత్వం ప్రజల మీద ఈ భారాన్ని మోపుతున్నారు. అదానీ స్మార్ట్ మీటర్ వల్ల శాశ్వతంగా దీర్ఘకాలం ప్రజలకు ప్రమాదమే అన్నారు. ఇది ప్రీపెయిడ్ మీటర్ అని బిల్లులు ముందే చెల్లించి రీచార్జ్ చేయించుకోవాల్సి ఉంటుందని అన్నారు. నగరంలో కొన్ని చోట్ల స్మార్ట్ మీటర్లు ఇళ్ళకు పెట్టేందుకు వస్తున్నారని, ఆనాడు చంద్రబాబు, లోకేష్ చెప్పినట్లుగానే స్మార్ట్ మీటర్లు బిగించేందుకు వస్తే ఈనాడు ఆ మాట అమలు చేస్తూ ప్రజలే స్మార్ట్ మీటర్లను పగలగొడతారని అన్నారు. విద్యుత్ భారాలను, బిల్లుల పెరుగుదల, స్మార్ట్ మీటర్లపై సిపిఎం ప్రజా పోరాటాలను నిర్వహిస్తుందన్నారు. విజయవాడలో సిపిఎం విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లపై పోరుబాటు కార్యక్రమం నిర్వహించి 50 వేల అభ్యంతర పత్రాలు స్మార్ట్ మీటర్లు తమ ఇళ్ళకు పెట్టొద్దని విద్యుత్ అధికారులకు అందించారన్నారు. అయినా ఇసుమంతైనా ప్రభుత్వంలో, అధికారుల్లో చలనం లేదని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అభ్యంతరం తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, నగర కార్యదర్శివర్గ సభ్యులు కోరాడ రమణ, స్థానిక నాయకులు కె.శివాజీ, తాడి రమణ, వి.గోపి, కసర లక్ష్మణ, బి.భారతి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సిటీ : స్మార్ట్ మీటర్ల రద్దుతో పాటు విద్యుత్ సర్దుబాటు చార్జీలను ఎత్తి వేయాలని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపుకు వ్యతిరేకంగా సిపిఎం నాయకత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కబేళా విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద స్మార్ట్ మీటర్లతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ బషీర్బాగ్ విద్యుత్ అమరవీరుల సాక్షిగా మరో విద్యుత్ పోరాటం మునుముందుకు సాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యుత్ కార్యాలయంలో ప్రజల నుంచి స్వీకరించిన అభ్యంతర పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.సూరిబాబు, సిపిఎం నగర కమిటీ సభ్యులు జి.వెంకట్రావు, ఎమ్‌డి.మస్తాన్, కె.వెంకటరత్నం, బాలరాజు వెంకటేశ్వరరెడ్డి, సిహెచ్ దాసు, పాల్గొన్నారు.

కృష్ణలంకలో ఆందోళన...

కబేళా విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన

నందిగామలో సంతకాల సేకరణ

నందిగామ : పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నందిగామలో పలు వార్డుల్లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె.గోపాల్, నందిగామ కమిటీ నాయకులు కర్రి వెంకటేశ్వర్రావు, పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

తిరువూరులో సమ్మెలో పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి - తిరువూరు : తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నుండి చేపట్టిన నిరవధిక సమ్మె తిరువూరులో కొనసాగుతుంది. నగర పంచాయతీ కార్యాలయం ముందు నిరవధిక దీక్షను కార్మికులు చేపట్టారు. వీరికి మద్దతుగా రైతు సంఘం సీనియర్ నాయకులు సాని కొమ్ము నాగేశ్వరరెడ్డి, న్యాయవాదుల సంఘం(ఐలు) నాయకులు మేకల నాగేంద్ర ప్రసా ద్, సీఐటీయూ సీని యర్నాయకులు ఎస్వీ.భద్రం పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఆకుల రవి, ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు షేక్ బాజీ, కందుల శ్రీనివాసరావు, అబ్దుల్ రఫీ, పింగళి నారాయణ, సుజాత, వాసు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు

ఇబ్రహీంపట్నం : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మున్సిపాలిటీ ఇంజనీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మెలో కొండపల్లి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సిఐటియు ఎం.మహేష్ ఆధ్వర్యంలో మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 29 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు యం వాసు, కరెంట్ శ్రీను, పంపుల శ్రీను, రవి, వెంకయ్య, అంజి , హనుమంత్, రాంబాబు, విజయ్ కుమార్, రామారావు, నరేష్, ఎలక్ట్రీషియన్స్ జోజి, దుర్గా రావు, తిరుపతిరావు, శ్రీను, ఆర్.శ్రీను, శివరామకృష్ణ, నోజు, వెల్డర్ డూమ్నిక్ రాజ్, పిట్టర్ ఆర్ శ్రీను, వి శ్రీను , ఆఫీస్ స్టాఫ్ క్రాంతి, నారాయణ, రమ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో సమ్మె చేస్తున్న కార్మికులు

నందిగామలో సమ్మె చేస్తున్న కార్మికులు

నందిగామ : నందిగామలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన ప్రదర్శన ఉధృతంగా సాగింది. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె. గోపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయుకులు మున్సిపల్ యూనియన్ కార్యదర్శి దసవరపు సైదా, పరిమి రవి, శ్రావణ్ కుమార్, దారెల్లి అశోక్, కండెల శ్రీను, దాసు,బ్రహ్మం, కార్మికులు పాల్గొన్నారు.

మీడియా పాత్ర ఎంతో కీలకం

ఎపిడబ్ల్యుజెఎఫ్ మహాసభ, ప్రజా ప్రెస్‌క్లబ్ ప్రమాణ స్వీకార సభలో వక్తలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

సమాజంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని, ప్రజలకు, ప్రభుత్వానికి సంధానకర్తలుగా జర్నలిస్టులు పనిచేస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో ఏపీడబ్ల్యుజెఎఫ్ మైలవరం నియోజకవర్గ మహాసభ, ప్రజా ప్రెస్ క్లబ్ ప్రమాణస్వీకార సభ జరిగింది. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్చార్జి అక్కల రామ్మోహన్ (గాంధీ) మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు తన వృత్తిలో విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని కోరారు. వాస్తవాలను తెలుసుకుని వార్తలు రాసే జర్నలిస్టులకు సమాజంలో మంచి గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయాల్లో పోటీతత్వం ఎలా ఉందో అదే విధంగా జర్నలిజంలో కూడా పోటీతత్వం ఉండాలని అప్పుడే సమాజానికి అవసమైన వార్తలు ప్రచురణలోకి వస్తాయని వివరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య మాట్లాడుతూ జర్నలిస్టులు వాస్తవాలను ప్రచారం చేసి విలువలు కాపాడుకోవాలని, అదే విధంగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంధానకర్తలుగా ఉండాలని సూచించారు. వార్తలు ప్రచురణ చేసేటప్పుడు వాటి వెనుక ఉన్న ఘటనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ శాసన, న్యాయ, కార్యనిర్వాహక శాఖల పని తీరుపై మీడియా నిఘా ఉంటేనే సమర్ధవంతంగా పని చేస్తాయని వివరించారు. పోలీసు శాఖ, మీడియా మధ్య సమన్వయం ఎంతో అవసరమని తెలిపారు. జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు బోలియశెట్టి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్ట్ సమాజ అభివృద్ధికి కృషి చేయాలనీ కోరారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏపీడబ్ల్యుజెఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంబి నాథన్, జిల్లా అధ్యక్షులు కె.కలిమిశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, మీడియా సిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుట్టుకుదురు శ్రీనివాస్, రావి ఫణి, కౌన్సిలర్లు వాసు, టీడీపీ నాయకులు మైలా సైదులు, జల్లి కాంతారావు, విజయవాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉమామహేశ్వరావు, ఎపిడబ్ల్యూజెఎఫ్ నగర నాయకులు శేఖర్, జర్నలిస్టు మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం సిఐ చంద్రశేఖర్

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.